సర్వ దేవతలకు ఆహ్వానం..!


ధ్వజారోహణ జరిపిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ధ్వజారోహణ నిర్వహించారు. శ్రీవారి కల్యాణ వైభవాన్ని వీక్షించేందుకు సర్వ దేవతలను ఆహ్వానించేలా ముహూర్త సమయంలో గరుడ పటం ఎగురవేశారు. స్వామివారి విశేష అలంకారాల్లో భాగంగా బక సంహార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పల్లె ప్రగతికి శ్రీకారం

తొలి రోజు 43 పనులకు శంకుస్థాపన

భీమవరం వన్‌టౌన్, ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు సోమవారం భూమి పూజ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధిని విస్మరించింది. ఫలితంగా మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం గ్రామాల సుస్థిర అభివృద్ధి దిశగా ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరుతో ఆగస్టు 23న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 937 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆమోదించిన పనులను ఉపాధి హామీ పథకం నిధులతో పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శంకుస్థాపనలు చేయనున్నారు.

తొలిరోజు ప్రారంభించినవి

జిల్లా	పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఏలూరు	27	3.72
పశ్చిమ	26	3.63

జనవరి నాటికి పూర్తి.. ఈ పనులను జనవరి నెలాఖరులోపు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం గోరింటాడ గ్రామంలో మంత్రి నిమ్మల రామానాయుడు సీసీ రహదాల నిర్మాణానికి, ఏలూరు జిల్లా నూజివీడులో మంత్రి పార్థసారథి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

లక్కు..! కిక్కు..!

పూర్తయిన మద్యం దుకాణాల కేటాయింపు


డ్రా తీస్తున్న హాలులో దరఖాస్తుదారులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: లక్కు... కిక్కు ఎవరికో తెలిసిపోయింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ విధానంలో దుకాణాల ఎంపిక లాటరీ ప్రక్రియ జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు మినీ బైపాస్‌లోని చెలసాని గార్డెన్స్‌లో.. మొత్తం 144 దుకాణాలకు లాటరీ తీశారు. కలెక్టర్ వెట్రిసెల్వి, సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య పర్యవేక్షించారు. ఉదయం 8.30 గంటలకు కలెక్టర్ లాటరీ ప్రక్రియ ప్రారంభించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంపికైన అభ్యర్థులు అద్దె మొత్తంలో 20 శాతం చెల్లించాల్సి ఉండగా... ఆ మొత్తం అక్కడికక్కడే చెల్లించి ధ్రువపత్రాలు అందుకున్నారు. తద్వారా రూ.14.68 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు.

1, 2, 3 చొప్పున.. తొలుత ఒక్కో దుకాణానికి వరుసగా 1, 2, 3 చొప్పున టోకెన్లు తీశారు. మొదట ఎంపికైన అభ్యర్థి ఏ పరిస్థితుల్లోనైనా వెనక్కు తగ్గితే రెండో వ్యక్తికి, అతడూ అనాసక్తి చూపితే మూడో అభ్యర్థికి దుకాణాలు కేటాయిస్తారు. 'లాటరీ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. దుకాణాలు పొందిన వారంతా 16న ప్రారంభించుకునేలా ఉత్తర్వులు ఇచ్చాం' అని ఎక్సైజ్ డీసీ శ్రీలత తెలిపారు. 'మొత్తం 144 దుకాణాలకు 5,499 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుదారుల సమక్షంలోనే డ్రా తీసి, ఎంపికైన వారి పేరు, నంబరు ప్రకటించాం' అని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

ఒకరికే 4.. ఏలూరులో నగరానికి చెందిన సజ్జల శ్రీకాంత్‌రెడ్డికి ఏలూరులో 4, 7, గ్రామీణంలో 23, 24 నంబర్ల దుకాణాలు లాటరీలో వరించాయి. కైకలూరు పరిధిలో కాట్రగడ్డ అనిల్‌కుమార్‌కు 113, 115 నంబర్లు, కలిదిండికి చెందిన రాయిని వెంకటేశ్వర్లుకు 118, 126 దుకాణాలు దక్కాయి.

క్షుణ్నంగా పరిశీలించాకే.. లాటరీ ప్రక్రియ సందర్భంగా చెలసాని గార్డెన్స్ వద్దకు సోమవారం ఉదయానికే పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు, వారి మద్దతుదారులు చేరుకున్నారు. మినీ బైపాస్ రోడ్డు కార్లు, జనాలతో నిండిపోయింది. దరఖాస్తుదారులను పోలీసులు క్షుణ్నంగా పరిశీలించి... లోనికి పంపారు. మహిళలు, వృద్ధులు సైతం పెద్ద సంఖ్యలో వచ్చారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఇన్‌ఛార్జ్ డీఆర్వో దేవకీదేవి, ఆర్డీవో అచ్చుత్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.



లాటరీలో తీసిన టోకెన్లు చూపుతున్న వెట్రిసెల్వి, శ్రీలత

మొదట ఏలూరు.. ఆఖరు బుట్టాయగూడెం.. లాటరీ ప్రక్రియలో తొలుత ఏలూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని దుకాణాలకు లక్కీడిప్ తీయగా-1వ నంబరు ఏలూరు కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావుకు దక్కింది. చివరిగా బుట్టాయగూడెం మండలంలోని 144వ దుకాణానికి లక్కీ డిప్ తీయగా- అదే గ్రామానికి చెందిన పూనెం కృష్ణను అదృష్టం వరించింది. చింతలపూడి 28, భీమడోలు 22, జంగారెడ్డిగూడెం 16, పోలవరం 12, నూజివీడు 16, కైకలూరు 21 దుకాణాలకు వరుసగా లాటరీ తీశారు.

మహిళలకు 14.. జిల్లాలో మద్యం దుకాణాల లాటరీలో పద్నాలుగు మంది మహిళలను అదృష్టం వరించింది. ఏలూరులో ఇద్దరు 9, 17 దుకాణాలకు ఎంపికయ్యారు. పోలవరం, చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం, భీమడోలు, ద్వారకాతిరుమల, ముసునూరు, కొయ్యలగూడెం, కుక్కునూరు, నూజివీడు గ్రామీణం, జీలుగుమిల్లిలో ఒక్కొక్కరికి చొప్పున దుకాణాలు వరించాయి.

సిండికేట్లదే హవా.. మద్యం లాటరీ ప్రక్రియలో సిండికేట్ల హవా కొనసాగింది. ఓ సిండికేట్‌కు ఏకంగా 4 దుకాణాలు వచ్చాయి. అదే ప్రాంతంలో ఎన్ఆర్ఐలకు 2 దుకాణాలు దక్కడంతో... సిండికేట్‌దారులు వారితో సంప్రదింపులు జరిపి... కొంత సొమ్ము ముట్టజెప్పి రెండు సొంతం చేసుకున్నారు. ఏలూరులోని ఓ బార్ యజమాని ఏకంగా 20 దరఖాస్తులు వేసినట్లు తెలిసింది. జిల్లా కేంద్రం ఏలూరులోనూ సిండికేట్ల హవా కొనసాగింది. ఇక్కడ ప్రధాన సిండికేటుకు 12 దుకాణాలు దక్కినట్లు సమాచారం.



జంగారెడ్డిగూడెంలో సుమారు రూ.2 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పురసేవ కేంద్రం ఇది. ప్రస్తుతం దీనిని తొలగించారు

ఆ ఊసే లేదు..

పట్టణాల్లో అటకెక్కిన పౌర సేవలు

జంగారెడ్డిగూడెం, నూజివీడు పట్టణం, చింతలపూడి, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టణాల్లో పౌర సేవలపై అధికారుల శ్రద్ధ కొరవడింది. నిర్ణీత గడువులోగా సేవలు అందించడంలోనూ నిర్లక్ష్యమే. సచివాలయాల ద్వారానే పౌర సేవలు అందుతాయన్న సాకు చూపి పురపాలక కార్యాలయాల్లో వీటిని పట్టించుకోవడం లేదు. ఈక్రమంలోనే పురపాలక కార్యాలయాల్లో ఉన్న పౌర సేవ కేంద్రాలకు మంగళం పాడారు. దీంతో వివిధ సమస్యలపై పురపాలక కార్యాలయాలకు ఫోన్ చేసినా, కార్యాలయాలకు వెళ్లినా తగిన సమాధానం చెప్పే నాథుడు లేకుండా పోయారు.

నూజివీడుదీ అదే దారి.. నూజివీడులోను పౌర సేవలు అటకెక్కాయి. అయితే ఇక్కడ ప్రత్యేక విభాగం కనిపిస్తోంది. దీనిని నిర్వహిస్తున్నామని కమిషనర్ వెంకట రామిరెడ్డి చెబుతున్నారు.

లక్షలు వెచ్చించి.. జంగారెడ్డిగూడెంలో పౌర సేవల విభాగం కోసం సుమారు రూ.2లక్షలు వెచ్చించి ప్రత్యేక ఛాంబర్ కట్టించారు. చాలా ఏళ్లుగా ఇది అలంకార ప్రాయంగానే ఉండిపోయింది. తర్వాత ఈ ప్రదేశంలో గదులు కట్టడంతో ఛాంబర్ తీసేశారు. పురపాలక కార్యాలయంలో ఒక గదిని పౌర సేవల కేంద్రం కోసం కేటాయించారు. అయితే ఆ సెంటర్ ప్రారంభించకపోవడంతో దానిని మెప్మాకు అప్పగించారు. ప్రస్తుతం బోర్డు కూడా లేదు. పౌర సేవలకు సంబంధించి త్వరలోనే బోర్డు ఏర్పాటు చేస్తామని కమిషనర్ రమణ తెలిపారు.

జాడ లేదు.. చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయంలో సేవా కేంద్రం జాడ లేదు. ఎన్నికల ముందు కోడ్ వచ్చాక ఇక్కడి బోర్డు పక్కన పెట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినా వీటిని ఏర్పాటు చేయలేదు. ఆయా పనుల నిమిత్తం నగర పంచాయతీకి వచ్చే ప్రజలకు అసలు పౌర సేవల గురించి తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది.

కంట్రోల్ రూము ఏర్పాటు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజల సౌకర్యార్థం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ప్రజలు సహాయ సహకారాలకు టోల్ ఫ్రీ నంబర్లు 08812 232101, 08812 222200ను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భారత రక్షణ రంగానికి గుర్తింపు తెచ్చిన సూరి భగవంతం

మంత్రి కొలుసు పార్థసారథి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భారత రక్షణ రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి డా.సూరి భగవంతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డీఆర్‌డీవో పూర్వపు డైరెక్టర్ డా.సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని శ్రీశోభనాద్రి లక్ష్మీనరసింహ వేద పాఠశాల ఆవరణలో ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో పూర్వపు ఛైర్మన్ డా.జి.సతీశ్‌రెడ్డిలతో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నూజివీడులో డా.సూరి భగవంతం స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట కృషి చేసిన వారికి ఆయన పేరిట అవార్డులు ప్రదానం చేసేందుకు ట్రస్టు నెలకొల్పాలని సూచించారు. దానికి తాను రూ.5 లక్షలు విరాళంగా అందజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దేశ రక్షణలో ప్రధాన పాత్ర వహించే బాలిస్టిక్ లాంచింగ్ పాడ్‌ను కృష్ణాజిల్లా నాగాయలంక సమీపంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని చెబుతూ, దాని కోసం కృషి చేసిన డా.సతీశ్‌రెడ్డిని ఆయన అభినందించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాటాడుతూ..తెలుగు నేలపై జన్మించిన మహనీయులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. డా.జి.సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణకు ఇతర దేశాల నుంచి పరికరాలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి మనం చేరుకోవడంలో డా.సూరి భగవంతం ముఖ్య పాత్ర పోషించారన్నారు. డా.సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.బి.రామ్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కొలుసు, పక్కన బుద్ధప్రసాద్, సతీశ్ రెడ్డి

తాడువాయి.. ఆక్రమణలదే పైచేయి..!

- రూ.కోట్ల విలువైన స్థలాలు మాయం
- చెరువులు, రహదారుల కబ్జా



తాడువాయి (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల కోసం తాడువాయి సమీపంలో కడుతున్న పునరావాస కాలనీలతో భవిష్యత్తులో అతి పెద్ద పట్టణంగా అవతరించే అవకాశం ఉంది. దీంతో తాడువాయిలో అదే స్థాయిలో ఆక్రమణలు వెలుస్తున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఈ గ్రామంలో విలువైన చెరువులు, పుంత రోడ్లు, రహదారి అంచులు, చివరకు శ్మశాన వాటికలను సైతం కబ్జా చేస్తున్నారు. ఆక్రమిత స్థలాలు భవంతులు, దుకాణాలు, హోటళ్లు, కిళ్లీ బడ్డీలుగా మారాయి. సమీప సర్వే నంబర్లతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఆక్రమణలను తొలగించి విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో యంత్రాంగం విఫలమవుతోంది. చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే పలువురు మీకోసం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికల్లోనూ వినతులు ఇచ్చారు. పంచాయతీ గ్రామ సభల్లోనూ గగ్గోలు పెట్టారు.



తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి నుంచి ములగలంపల్లి వెళ్లే రోడ్డు ఆక్రమణల్లో ఉంది. అంచులను ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. ఈ కారణంగా పలు చోట్ల ఇరుకుగా మారింది. జాతీయ రహదారి నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా గ్రామంలోకి వెళ్లే మార్గం ప్రారంభంలో ఇరువైపులా ఆక్రమణలున్నాయి. ఈ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపైకి వచ్చేవారికి రోడ్డు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహన దారుడు మృతి చెందాడు.

గ్రామంలోని ఫకీరు కుంట చెరువు విస్తీర్ణం 4.76 ఎకరాలు కాగా.. ఆక్రమణల కారణంగా ప్రస్తుతం సుమారు ఎకరానికి కుచించుకుపోయింది. గ్రామానికి మధ్యలో, తల్లాడ - దేవరపల్లి జాతీయ రహదారిని ఆనుకొని ఉండటంతో భవనాలు, దుకాణాలు వెలిశాయి. విలువైన ప్రదేశం కావడంతో ఇక్కడ ఎకరం రూ.50 లక్షలు ఉంది. దీంతో ఆక్రమిత స్థలం సుమారు రూ.1.50 కోట్లు పైమాటే. చెరువుకు కొలతలు వేసి హద్దులు నిర్ణయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- గొల్లకుంట నుంచి వెంకటచెరువు సమీపంలోని 100 లింకుల పుంత రోడ్డు ఆక్రమణల్లో ఉంది. దీన్ని సర్వే చేసి ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

తీర్మానం చేస్తే సర్వే చేస్తాం.. గ్రామ పంచాయతీ తీర్మానం చేసి దరఖాస్తు చేస్తే సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ స్లీవజోజి తెలిపారు. ఆక్రమణలను గుర్తించేందుకు ఫకీరుకుంట చెరువు, తల్లాడ -దేవరపల్లి జాతీయ రహదారి సర్వే ప్రారంభించామని గ్రామ కార్యదర్శి సునీల్ తెలిపారు. మిగిలిన ఆక్రమణలపైనా దృష్టి పెడతామని చెప్పారు.

చౌక బియ్యం బొక్కేస్తున్నారు..!

- బస్తాల బరువులో తేడాలు
- గగ్గోలు పెడుతున్న డీలర్లు

6.42 లక్షలు	రేషన్ కార్డులు
1,164	చౌక దుకాణాలు
408	ఎండీయూ వాహనాలు
08	ఎంఎల్ఎస్ పాయింట్లు
9,500 టన్నులు	నెలకు సరఫరా చేస్తున్న బియ్యం

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాలు తూకం తక్కువ ఉంటున్నాయని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గాడితప్పిన రేషన్ పంపిణీ వ్యవస్థ ఇప్పటికీ గాడిన పడలేదు. గత అయిదేళ్ల కాలంలో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దనే దోపిడీ యథేచ్ఛగా సాగింది. కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం బస్తాల బరువులో తేడాలపై గతంలో రేషన్ డీలర్లు బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అక్కడి పరిస్థితి అలాగే ఉంది. దీంతో ప్రజా పంపిణీకి బియ్యం సరిపోవడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తూకం తక్కువగా ఉన్న బియ్యం బస్తా



కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్ (పాత చిత్రం)

గతంలోనూ ఇలానే.. మూడేళ్ల కిందట నిల్వల్లో భారీ వ్యత్యాసాలు చూపి వేలాది టన్నుల బియ్యాన్ని మాయం చేసిన కైకలూరు ఎంఎల్ఎస్ కేంద్రం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. అప్పట్లో ఈ వ్యవహారంలో వైకాపా మంత్రులకూ వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సుమారు రూ.3.6 కోట్ల కుంభకోణంలో రేషన్ డీలర్లను బలి పశువులను చేసి వాళ్లకు ఇవ్వాల్సిన బియ్యాన్ని దారి మళ్లించారు. తర్వాత ఈ కేసును నీరుగార్చారు.

మాయం చేసేదిలా.. స్టేజ్-1 (జిల్లా బఫర్ గోదాములు) నుంచి స్టేజ్- 2 (ఎంఎల్ఎస్ పాయింట్లకు) బియ్యం సంచులు సరఫరా చేస్తారు. ఒక్కో సంచి అర కిలో బరువు ఉంటుంది. నిబంధనల ప్రకారం 50.580 కిలోలు బియ్యం బస్తా ఉండాలి. అయితే స్టేజ్-2 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలర్లకు చేరే లోపు తేడా వస్తోంది. ఒక్కో సంచి 46-48 కిలోలు మాత్రమే ఉంటోంది. దీంతో ఒక్కో దుకాణానికి సుమారు 300 కిలోల బియ్యం ప్రతి నెల గండి పడుతోంది.

నిబంధనల చెల్లు చీటీ.. ప్రతి చౌక దుకాణదారుడికి వారి సమక్షంలో సరకులు తూకం వేసి అతని వేలిముద్రలు సేకరించిన తర్వాతే లారీల్లో బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. కానీ సరకు తరలించిన తర్వాత వేలిముద్రలు తీసుకుంటున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే సంచుల నుంచి బియ్యాన్ని కాజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాల్సిన బియ్యం కోటాలోనూ కోతలు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై ఏలూరు జిల్లా డీఎస్‌వో సత్యనారాయణరాజును 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలో ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేస్తామని చెప్పారు.

విద్యుత్తు అధికారులు అప్రమత్తం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ పర్యవేక్షక ఇంజినీరు పి.సాల్మన్‌రాజు కోరారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశానుసారం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏలూరు జిల్లా విద్యుత్తు సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 94409 02926 లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494


ఇలా వండితే.. ఏ రోజూ కాదనం!

- మధ్యాహ్న భోజనం మెనూ మార్పు
- నవంబర్ నుంచి అమలుకు కసరత్తు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెడితే, చదువుపై దృష్టి సారిస్తారనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిందే మధ్యాహ్న భోజన పథకం. 2019కి ముందు మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కొనసాగేది. తర్వాత కాలంలో వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ నచ్చక కొన్నిసార్లు 50 శాతం మంది కూడా బడి భోజనం చేయని దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి సారించింది. రాష్ట్రమంతా ఒక్కటే మెనూ కాకుండా ప్రాంతీయ అభిరుచులకు అనుగుణంగా జిల్లాల వారీగా మెనూ రూపొందిస్తుంది. ఉమ్మడి జిల్లాకు కొత్త మెనూ కోసం తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు అభిప్రాయ సేకరణ పూర్తిచేసి అమరావతి పంపించారు.

సన్న బియ్యానికి మొగ్గు.. ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి పైబడిన విద్యార్థులు సన్న బియ్యం అయితేనే తింటారని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలంటే సన్నబియ్యం సరఫరా చేయాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. గుడ్డుకు బదులుగా ప్రోటీన్లు అందించే పండును ఒకరోజు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. సాధ్యాసాధ్యాలపై కసరత్తు పూర్తి చేసి బాలల దినోత్సవం నాటికి కొత్త మెనూ అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



ఇచ్చేది పెంచాలి.. వంట నిర్వాహకులకు ఖర్చుల నిమిత్తం ఇచ్చే బిల్లు నుంచి జీతం వరకు మరి కొంత మొత్తాన్ని పెంచితే నాణ్యతగా అందించడానికి అవకాశం ఉంటుందనే అభిప్రాయం కూడా అధికారుల నుంచి ఉపాధ్యాయుల వరకు వెల్లడించారు. గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ ఖర్చవుతున్నందున రాయితీపై అందించాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న జీతం రూ.3 వేలు చాలా కాలంగా కొనసాగుతున్నందున దానిని కనీసం రూ.పది వేలకు పెంచాలని నిర్వాహకులు కోరుతున్నారు. దీనిపై జిల్లా మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణాధికారి ఎన్.సత్యనారాయణను సంప్రదించగా మెనూ మార్పు కోసం ప్రతిపాదనలు పంపించామని నవంబర్ నాటికి అమల్లోకి రావొచ్చని చెప్పారు.

ఉద్యోగాలు ఇస్తామంటే మోసపోవద్దు: ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికితే.. విశ్వసించి మోసపోవద్దని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' నిర్వహించారు. ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసి మోసం చేశాడని ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాల కోసం దళారులను నమ్మవద్దన్నారు. మోసగాళ్లు, సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సూచించారు. మొత్తం 45 ఫిర్యాదులు అందగా.. పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.


బాధితులతో మాట్లాడుతున్న ప్రతాప్ శివకిశోర్

A++ NAAC 3rd CYCLE
nirf Rank Band 201-300 6 Consecutive Years
GGU
Godavari Global University

WALK-IN INTERVIEW

Godavari Global University, Rajamahendravaram. A premier institution in higher education, is seeking result-oriented professionals for the following positions at our regional offices in Rajamahendravaram, Kakinada, Bhimavaram and Amalapuram:

CLUSTER HEAD / BRANCH HEAD
Candidates must be graduates with at least 3 years of experience in Sales / Marketing and proven team management capabilities. The role involves leading and motivating the team to achieve set targets.

MARKETING OFFICERS / COUNSELLORS
Candidates must be graduates with a minimum of 1 year of experience in Sales/Marketing. Female candidates are preferred for the position of counsellors.

Excellent communication skills in English and the local language are essential.

Remuneration and performance-based incentives will be commensurate with qualifications and experience. Candidates from Education/Finance backgrounds will be given preference.

WALK-IN INTERVIEW AT GGU REGIONAL OFFICES
Rajamahendravaram: 15th & 16th October at NH16, GIET Campus, Call: 9949993483
Kakinada: On 17th October at CIST, Sarpavaram Junction. Call: 9959911482
Amalapuram: 18th October, at KIMS, Call: 9000544888
Bhimavaram: 19th October, Call: 9949993483

Or send your resume to jobs@ggu.edu.in

(c) eenadu

'టెట్'కు 63 మంది గైర్హాజరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 372 మంది అభ్యర్థులకు 309 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 63 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు మైదానంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించాల్సిన అండర్-14, 17 విభాగాల బాలబాలికల హాకీ, ఆర్చరీ ఎంపిక పోటీలు వాయిదా పడ్డాయి. స్థానిక కలెక్టరేట్ సమీప ఇండోర్ స్టేడియంలో యోగా ఎంపిక పోటీలు యథావిధిగా కొనసాగనున్నాయి. వాయిదా పడిన ఎంపిక పోటీల నిర్వహణ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహణాధికారిణి అలివేలు మంగ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

SHRIRAM శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: డి.నెం. 22బి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్లెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002.


(రూల్ 8(3) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

... ఏలూరు మున్సిపల్ ఏరియా, రామచంద్రరావు పేట, గుబ్బాలవారి వీధి, డబ్ల్యుపి వార్డు, టి.ఎస్.నెం.లు 179, 321, 318, 319 & 320 లోని 1214 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 90 చ॥గ॥లు లేదా 74 చ॥మీ॥ల విస్తీర్ణంలో డి.నెం.23ఎ-5-50 దగ్గర గల ఖాళీ స్థలం. **హద్దులు : తూర్పు:** కదలి సుశీల దేవి గారి స్థలం, **దక్షిణం :** మల్లి రమేష్ కుమార్ గారు కొనుగోలు చేసిన ఆస్తి, **పడమర:** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** అమ్మకందారు పి. రంగారావు గారి మిగిలిన భూమి.

ప్రదేశం : ఏలూరు
తేది : 14-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్





విదేశీ విద్యపై ఆసక్తి

- తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఏటేటా పెరుగుతున్న విద్యార్థులు

ఉమ్మడి జిల్లా నుంచి ఏటా విదేశాలకు వెళ్లి చదివే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎంఎస్ లేదా పీజీ చేయడానికి విదేశాలకు వెళ్లేవారు. ప్రస్తుతం అక్కడే ఇంజినీరింగ్, డిగ్రీ చేసేందుకు సైతం ఆసక్తి చూపుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు విద్యా విభాగం

★ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏటా దాదాపు 1,500 మంది విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదవడానికి విదేశీ బాట పడుతున్నారు. ఇందులో పీజీ చేసేవారు అత్యధికం. 2014-19 తెదేపా హయాంలో ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వేల మంది విద్యార్థులను ప్రోత్సహించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పథకానికి నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడటంతో.. బకాయిలున్న వారికి సైతం ఇటీవల నిధులు వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, కాపు, ఆర్థికంగా వెనకబడిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహంతో విదేశాల్లో చదవడానికి సిద్ధమవుతున్నారు.

అక్కడికే ఎందుకు...?

విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తే అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందిపుచ్చుకోవచ్చు. ఎంఎస్ పూర్తి చేస్తే అక్కడే స్థిరపడి ఆర్థికంగా బలోపేతం కావొచ్చు. విదేశీ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఎక్కువ శాతం ఉపకార వేతనాలిస్తున్నాయి. దీనికితోడు ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో విదేశాల్లో చదివి అక్కడే స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు.

ప్రవేశ పరీక్షలపై దృష్టి



ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ చేయాలనుకునేవారు జీఆర్‌ఈ రాయాల్సి ఉంటుంది. ఎంబీఏ చేయాల్సిన వారు జీమ్యాట్ రాయాలి. వీటితో పాటు ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ పరీక్షలు ఉంటాయి. జీఆర్‌ఈలో 340కి 315 మార్కులు వస్తే టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో సీటు వస్తుంది. డిగ్రీ స్థాయిలో 70 శాతానికి పైగా మార్కులుండాలి. విద్యార్థి డిగ్రీ స్థాయిలో చేసే ప్రాజెక్టు, పేపర్ పబ్లికేషన్, ఇంటర్న్‌షిప్‌లను కూడా విశ్వవిద్యాలయాలు సీటిచ్చే సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. - జేవీ మూర్తి, ఐవికా కన్సల్టెన్సీ ఎండీ

డిగ్రీ చదివేందుకు...



ఇటీవల డిగ్రీ చదవడానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలుండటంతో ... వారిలో మెరిట్‌ను గుర్తించి విదేశీ విశ్వవిద్యాలయాలు 50 నుంచి 70 శాతం వరకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. విదేశాల్లో చదవాలనుకునే వారు అక్కడి విశ్వవిద్యాలయాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు. - బి.దుర్గాప్రసాద్, తక్షశిల ఐఏఎస్ అకాడమీ, ఛైర్మన్



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

పోలీసు శిక్షణ కేంద్రం పరిశీలన

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సోమవారం ప్రిన్సిపల్ హోదాలో సందర్శించారు. శిక్షణ తరగతి గదులు, సమావేశ మందిరాలు తదితరాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఏయే అంశాల్లో, ఎంత మందికి శిక్షణ ఇచ్చారు... ఇంకా ఎందరికి ఇవ్వాలి.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జులై నుంచి దేశవ్యాప్తంగా నూతన చట్టాలు అమలవుతుండటంతో... దీనిపై ఎంత మందికి శిక్షణ ఇచ్చారో ఆరా తీశారు. ఆయన వెంట శిక్షణ కేంద్రం సీఐ రామారావు, ఎస్సైలు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో ఇద్దరి మృతి

- ఒకే గ్రామంలో.. ఒకే రోజు
- మేడేపల్లిలో ఘటన

వేలేరుపాడు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురై ఒకే గ్రామంలో ఒకే రోజు ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషాదకర ఘటన వేలేరుపాడు మండలం మేడేపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్సం నాగేశ్వరరావు(28) వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి కడుపులో గ్యాస్ నొప్పిలా రావడంతో కుటుంబీకులు 108 వాహనంలో వేలేరుపాడు పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి తీవ్రం కావడంతో జంగారెడ్డిగూడేనికి పంపారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ సిబ్బంది రెండు ఇంజెక్షన్లు చేసి బాగానే ఉందని చెప్పారు. సోమవారం ఇంటికి తీసుకొస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన మడకం నితిన్(20) మూర్ఛ జులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్థానికంగా చికిత్స చేయించుకున్నాడు. సోమవారం ఉదయం ఇంటి వద్ద మృతిచెందాడు. గ్రామంలో ఒకే రోజు ఇద్దరు మరణించడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. చనిపోయిన వ్యక్తుల అనారోగ్యం విషయం తమ దృష్టికి రాలేదని కేఆర్‌పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్, వేలేరుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు అగత తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.

ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రముఖ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్‌లు కృష్ణకిరణ్, నీల్‌శీత్‌లు 20 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, 8 మందికి తుంటి, మోకాలి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.ఎం.గుప్తా సహకారంతో 16 మంది దివ్యాంగులకు ప్రోస్తసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ అందజేసినట్లు ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న వైద్యులు కృష్ణకిరణ్, నీల్ శీత్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఎటపాక, న్యూస్‌టుడే: గ్యాస్ బండలతో వెళుతున్న మినీ లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గన్నవరం సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కె.పార్థసారథి తెలిపిన వివరాల ప్రకారం. . హెచ్‌పీ గ్యాస్ బండలతో మినీ వ్యాన్ కూనవరం వెళ్తోంది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన గాదే అనిల్(37) కూనవరం వైపు నుంచి భద్రాచలం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గన్నవరం సమీపంలో రెండు వాహనాలు ఢీకొట్టడంతో అనిల్ రోడ్డుపై పడగా తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. అనిల్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు.



గ్యాస్ బండల మినీ లారీ

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- భర్త మృతి
- భార్యకు గాయాలు

బాదంపూడి (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో భర్త మృతి చెందగా.. భార్యకు గాయాలైన ఘటన 216ఏ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బొమ్మిడికి చెందిన యర్రా పెద్దిరాజు(70), నాగమణి దంపతులు ఉంగుటూరులోని బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలోని బాదంపూడి వై జంక్షన్ వద్ద రావులపాలెం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో పెద్దిరాజు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.



ప్రమాదానికి కారణమైన కారు

గడ్డి మందు తాగి ఆత్మహత్య

భీమడోలు, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమడోలు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గుండుగొలను ఎస్సీ కాలనీకి చెందిన బోడ కుమార్‌రాజా(45) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఆదివారం మరోమారు మద్యం తాగి ఘర్షణకు దిగడంతో కుటుంబీకులు మందలించారు. మనస్తాపానికి గురైన అతడు.. గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బాధితుడి సోదరుడు రాజేంద్ర కుమార్ హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కణ్నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం కొనివ్వలేదని యువకుడు..

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అడిగిన వెంటనే తండ్రి ద్విచక్ర వాహనం కొనివ్వలేదన్న మనస్తాపంతో తెడ్లాం గ్రామానికి చెందిన పిన్నిబోయిన పృథ్వీ(23) ఈ నెల 12న కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని తొలుత చింతలపూడి ఆసుపత్రికి, అక్కడికి నుంచి ఏలూరుకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనిపై మృతుడి తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎం.జయరాజు తెలిపారు.

బోట్ల యజమానులు నిబంధనలు పాటించాలి

పోలవరం, న్యూస్‌టుడే: పాపికొండల పర్యాటకులను తీసుకెళ్లే బోట్ల యజమానులు అటవీ శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలవరం అటవీ శాఖ అధికారి ఎస్కే వలీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నోటీసులు పంపారు. సాధ్యమైనంత వరకు పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు నదిలో వేయకుండా చూడాలన్నారు. జంతువులకు శబ్ద కాలుష్యం కల్పించొద్దని సూచించారు. నోటీసులు అందుకున్న వెంటనే బోట్ల యజమానులు గుంటూరులోని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ నుంచి అనుమతులు పొందాలన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి వి. జయప్రకాశ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం అభ్యర్థులకు వసతితో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. టెట్ అర్హత కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 21 లోపు జ్ఞానభూమి పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యదర్శుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డి.ఎన్.వి.డి ప్రసాద్, టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. అయిదేళ్లుగా వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆరోగ్య కార్యదర్శుల సీనియారిటీ జాబితా వెంటనే విడుదల చేయాలని, ఎంపీహెచ్‌వో(ఎఫ్) ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

ఉద్ధృతంగా సముద్ర అలలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర అలలు ఉద్ధృతంగా మారాయి. పేరుపాలెంసౌత్, కేపీపాలెం సౌత్‌లలో సముద్ర అలలు ప్రమాదకరంగా ఎగసిపడుతున్నాయి. తుపాను ఉద్ధృతి తగ్గేవరకు పర్యాటకులకు అనుమతి లేదని తహసీల్దారు కె.రాజకిశోర్ తెలిపారు. సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఆయన మత్స్యకారులకు సూచించారు.



92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

BUSINESS OFFER

బిజినెస్ ఆఫర్ ఇండియాలో నెంబర్ 1 పొజిషన్‌లో ఉన్న కంపెనీలో కేవలం రూ.20,000/-తో వ్యాపార అవకాశం. సంప్రదించండి సేఫ్ షాప్, విజయవాడ. 9704855112

JOBS

Newly Constructing SMC Hospital requires Doctors, Nurse, Pharamacist, Lab Technician, Accountant with Tally Knowledge, Receptionist with Computer Knowledge. Accommodation facility available. ✆ 96181 16262. Interview: 16-10-24. 9AM to 1PM at Pedavegi (V & M), Eluru District - 534435.

హైదరాబాద్‌లో ప్రముఖ సంస్థలో పనిచేయుటకు మెకానికల్ ఇంజినీర్స్, పాలిటెక్నిక్, ITI చేసిన అభ్యర్థులు కావలెను. వసతి సదుపాయం కలదు. ✆ 94913 04689.

Work from Home పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, టెలీకాలింగ్ ఎక్స్‌పీరియన్స్ Compulsary, నో టార్గెట్స్, స్పాట్ జాయినింగ్. Ph. 80193 40432.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

WANTED

భీమవరంలో ప్రముఖ బట్టల షోరూంలో పనిచేయుటకు ఈ క్రింద స్టాఫ్ కావలెను.
అనుభవం కలిగిన ఫుల్‌టైం అకౌంటెంట్ (TALLY, I.T. Returns, GST Returns) కావలెను
ఆకర్షణీయమైన జీతం
Cont. 70197 57404

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పైౖ
తణుకు ఆఫీసు: 08819-224254

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్ - తాడేపల్లిగూడెం
9-15-1/1, లక్ష్మీనారాయణ థియేటర్ దగ్గర, తణుకు రోడ్, తాడేపల్లిగూడెం-534102
ఫోన్: 08818-225625, ఇ-మెయిల్: arb.tadepalligudem@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

1	డిమాండ్ నోటీసు తేది : 03.08.2022; మొండిబ్యాకీ ఆస్తిగా ప్రకటించిన తేది : 12.09.2024	స్వాధీనత తేది : 30.12.2022
2	డిమాండ్ నోటీసు తేది : 23.03.2023; మొండిబ్యాకీ ఆస్తిగా ప్రకటించిన తేది : 12.09.2024	స్వాధీనత తేది : 07.10.2023
3	డిమాండ్ నోటీసు తేది : 04.10.2023; మొండిబ్యాకీ ఆస్తిగా ప్రకటించిన తేది : 12.09.2024	స్వాధీనత తేది : 13.12.2023
4	డిమాండ్ నోటీసు తేది : 10.02.2023; మొండిబ్యాకీ ఆస్తిగా ప్రకటించిన తేది : 12.09.2024	స్వాధీనత తేది : 14.02.2024
5	డిమాండ్ నోటీసు తేది : 09.09.2022; మొండిబ్యాకీ ఆస్తిగా ప్రకటించిన తేది : 12.09.2024	స్వాధీనత తేది : 02.01.2023

ప్రదేశం : తాడేపల్లిగూడెం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, తాడేపల్లిగూడెం-534102

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

విధిగా ఓటు నమోదు చేసుకోవాలి

నిడమర్రు (గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలని తహసీల్దారు ఎస్. నాగరాజు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల పరిషత్తు, రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమావేశమై మాట్లాడారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటరు దరఖాస్తు ఫారం 18 పూర్తి చేసి, విద్యార్హత ధ్రువపత్రాల నకలును గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి సమర్పించాలన్నారు. నవంబరు 6లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఎంపీడీవో విజయకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఊరేగింపు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉప్పాకపాడు, నారాయణపురం, కైకరం, ఉంగుటూరు, చేబ్రోలులో సోమవారం తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులు, కోలాటాల వివిధ వేషధారణ నడుమ అమ్మవార్లను ఊరేగించారు. మహిళలు అమ్మవార్లకు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



ఉప్పాకపాడులో అమ్మవారి గ్రామోత్సవం

గుర్రపుడెక్క తొలగింపు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను ఎట్టకేలకు తొలగించారు. 'చెరువు నిండా గుర్రపుడెక్క' శీర్షికన ఈ నెల 2న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. కార్మికులతో చెరువులో నిండిపోయిన గుర్రపుడెక్కను తొలగింపజేశారు.

నేటి నుంచి 'పల్లె పండగ'

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలో మంగళవారం 'పల్లె పండగ' నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి. శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జనసేనకు ప్రజాదరణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జనసేనకు ప్రజాదరణ పెరుగుతుందని ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరులో నాగరాజ సంక్షేమ సంఘం నాయకులు సుమారు 150 మంది సంఘం సోమవారం జనసేనలో చేరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి వెంకటరావు తదితరులను అప్పలనాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. మాజీ ఉప మేయర్ ప్రసాద్, జనసేన నగర రాధ్యక్షుడు కాశీ నరేష్ తదితరులున్నారు.

చిత్తశుద్ధి లేదాయె.. చెత్తశుద్ధి కాదాయె!

ఇష్టానుసారంగా పడేస్తూ...

★ డంపింగ్ యార్డులను తలపిస్తున్న రోడ్ల అంచులు ★ ప్రజారోగ్యానికి పాతర వేస్తున్న అధికారులు

తంగెళ్లమూడి(ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే

ఏలూరు నగరంలోని ప్రధాన రహదారుల అంచులు చెత్త నిల్వ కేంద్రాలను తలపిస్తున్నాయి. ఏ దారి చూసినా, గుట్టల్లా పేరుకున్న వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. ఏలూరుతోపాటు విలీన గ్రామ పంచాయతీలైన వెంకటాపురం, తంగెళ్లమూడి, శనివారపుపేట, సత్రంపాడు, చోదిమెళ్ల, కొమడవోలు, పోణంగిల నుంచి రోజుకు టన్నులకొద్దీ వ్యర్థాలు సేకరించి... రిక్షాలు, ట్రాక్టర్లు, మినీ వ్యానులు, లారీల్లో తరలిస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రజారోగ్య విభాగం కీలకం. పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తుండగా- వారిని శానిటరీ మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తుండాలి. వార్డు సచివాలయ కార్యదర్శులకూ పర్యవేక్షణ బాధ్యతలున్నాయి. నగరంలో పోగైన చెత్తను పోణంగి రోడ్డులోని చెత్త నిల్వ కేంద్రానికి తరలించాలి. అక్కడ రీసైక్లింగ్ చేసి సేంద్రియ ఎరువుగా మార్చాలి. పారిశుద్ధ్య నిర్వహణకు ఏటా రూ. కోట్ల నిధులు వెచ్చిస్తున్నా, ప్రక్రియ మాత్రం సాఫీగా సాగడం లేదు. అంతటా సమన్వయ లోపమే కనిపిస్తోంది. నగరంలో పారిశుద్ధ్య లోపంపై ప్రజల నుంచి విర్శాదులు వెల్లువెత్తుతున్నాయి.



తంగెళ్లమూడి ఎఫ్‌సీఐ గోదాముల వద్ద వ్యర్థాలు

నగరంలో సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా పడేస్తున్నారు. ప్రధానంగా ఏలూరు - చింతలపూడి ప్రధాన రహదారిలోని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి వట్లూరు వరకు రోడ్డు అంచులు మొత్తం చెత్త కుప్పలు, ఖాళీ కొబ్బరి బొండాలతో గుట్టలా పేరుకుపోయాయి. ఏలూరు - కైకలూరు రోడ్డులోని కబేళా సమీపం, చాటపర్రు రోడ్డు, జంగారెడ్డిగూడెం రోడ్డు, గ్రీన్ సిటీ సమీప మినీ బైపాస్ రోడ్డులోనూ వ్యర్థాలు ఇబ్బడిముబ్బడిగా నిండిపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో.. చెత్తాచెదారాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు ఆవాస కేంద్రాలుగా మారాయి. వ్యర్థాలను పందులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్లపై వచ్చిపోయే వారికి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

'పారిశుద్ధ్య సిబ్బందిని రహదారుల అంచుల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాలు తొలగిస్తాం. ఇకపై రోడ్ల అంచుల్లో ఎవరూ వ్యర్థాలు పారబోయకుండా చర్యలు తీసుకుంటాం' అని నగరపాలక సంస్థ సహాయాధికారి చంద్రయ్య తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి శిర్డీ నగర్ వెళ్లే దారిలో పక్షం రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం.
- టి.రామకృష్ణంరాజు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. - కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ

సమస్య: శాంతినగర్ కాదలి నుంచి సెయింట్ గ్రేవియర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - వి.సుదర్శనరావు, స్థానికుడు

సమాధానం: గుంతలు పూడ్చించడానికి చర్యలు తీసుకుంటాం. - గోవింద మోహన్, ర.భ.శాఖ డీఈ

సమస్య: ఒకటో పట్టణం బెనర్జీపేట న్యూ మార్కెట్ సందులో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తుండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. - పప్పు చిరంజీవి, వ్యాపారి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తాచెదారాలు తొలగిస్తాం. - భానుప్రతాప్, నగరపాలక అధికారి

సమస్య: అశోక్‌నగర్ కేడీజీటీ పాఠశాల వెనుక రోడ్డులో కాలువల్లో మురుగు పేరుకుపోయింది. రాత్రివేళ దోమల మోత భరించలేక పోతున్నాం. - ఆర్.భగవాన్, స్థానికుడు

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. - జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి

పెదవేగి, న్యూస్‌టుడే

సమస్య: పెదవేగి- లక్ష్మీపురం ర.భ.శాఖ రహదారి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - వాహన చోదకులు

సమాధానం: రహదారిని పరిశీలించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. - బలరాం, ర.భ.శాఖ ఏఈ, పెదవేగి

దశలవారీగా హామీలన్నీ నెరవేరుస్తాం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ దశలవారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఉప కేంద్రం పరిధిలో 5,600 ఇళ్లకు విద్యుత్తు అందించనున్నట్లు చెప్పారు. మార్చి నెలాఖరుకు టిడ్కో గృహాలు పూర్తి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే వద్ద ఏకరవు పెట్టారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. విద్యుత్తు ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ శశిధర్, సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే చంటి తదితరులు

వైద్య సేవలకు తోడ్పాటు

చేబ్రోలు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అత్యవసర వైద్య సేవలు అందించడానికి సీఎస్ఆర్ నిధులతో తోడ్పాటు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో వైప్లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఐపీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.8 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో అత్యవసర గది నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచి రాంధే లక్ష్మీ సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, రాయి లక్ష్మి, పీపీఎల్ కార్పొరేట్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ షేక్ అన్వరుల్లా ఖాన్, వైద్యాధికారులు సుబ్బరాజు వర్మ, శ్రావణ్ రెడ్డి, బొమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధనీరు అందించాలని వినతి

గణపవరం, న్యూస్‌టుడే: జల్లికకొవాడ వాసులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సోమవారం సీపీఎం సంప్రదాయ అధ్యక్షతన 8వ మహాసభ నిర్వహించారు. జగనన్న కాలనీలో రహదారులు, మురుగు కాలువల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు సత్యనారాయణ, నరసింహమూర్తి, సోదదాసి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబికా డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబికా మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	స్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి మినీప్లెక్స్ 1	దేవర
విజయలక్ష్మి మినీప్లెక్స్ 2	దక్షిణ
విజయలక్ష్మి మినీప్లెక్స్ 3	జిగ్రా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విశ్వం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. వెల్లమిల్లి, చేబ్రోలు, గోపినాథపట్నం, రామచంద్రపురం, బాదంపూడి, ఉప్పాకపాడు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని రూ. 66.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి కావాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మొక్కలు నాటారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు రాంధే లక్ష్మీ సునీత, పద్మశ్రీ, కుమార్‌రాజా, విష్ణుమూర్తి, రాము, వీరవెంకట మోహనరావు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, జేఈ కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ధర్మరాజు తదితరులు

నిరంతరాయంగా సరఫరా.. చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మరాజు తెలిపారు. చేబ్రోలు విద్యుత్తు ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్తు ఈఈ అంబేడ్కర్, ఏఈ వేణు తదితరులు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: విద్యానగర్ పెండిమెం రోడ్డులోని మురుగు కాలువలను ఎట్టకేలకు శుభ్రం చేశారు. కాలువలో మురుగు పేరుకుపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 9న సమస్య ప్రచురితమైంది. నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

వెలిగిన వీధి దీపం..

వెన్నవల్లివారిపేట రిక్షా కాలనీ రెండో రోడ్డులో వీధి దీపం వెలిగింది. రోజుల తరబడి దీపం వెలగకపోవడంపై ఈ నెల 11న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించారు. సిబ్బందిని పంపి వీధి దీపాన్ని బాగు చేయించారు.

విశ్రాంత భవన నిర్మాణానికి భూమి పూజ

అప్పనవీడు(పెదపాడు), న్యూస్‌టుడే: అప్పనవీడులోని జేఎంజే మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేచి ఉండేందుకు రూ.4 లక్షలతో నిర్మించనున్న విశ్రాంత భవనానికి ప్రవాసి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సత్యప్రసాద్ సోమవారం భూమి పూజ చేశారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ విద్యనందించడమే తమ ట్రస్టు లక్ష్యమన్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ నాలం సరసింహారావు, ప్రధానాచార్యులు ఆంథోనమ్మ, రామ్మోహనరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పిప్పర విద్యార్థుల ప్రతిభ

గణపవరం, న్యూస్‌టుడే: పిప్పర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పి.జయ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల భీమవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో యు.వరుణ్, అండర్ 17 విభాగంలో బూసి సుధీర్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారన్నారు. త్వరలో నంద్యాలలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను గ్రామస్థులు సోమవారం అభినందించారు.

కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకొస్తాం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకొస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైకాపా నాయకుడు బండి వెంకటేశ్వరరావుతో పాటు పది మంది కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి రామ్మోహనరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దండుబోయిన చంద్రశేఖర్, ఏలూరు నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సేవాదళ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహనరావు

కాలనీ సమస్యలు తీరేదెన్నడో?

నెరవేరని హామీ

నిడమర్రు, న్యూస్‌టుడే

నిడమర్రు మండలం పెదనిండ్రకొలను సమీప దండగర్రలోని ఇందిరమ్మ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ సుమారు 50 కుటుంబాలున్నాయి. 150 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. మరో వందకు పైగా గృహాలు నిర్మించాల్సి ఉంది. స్థానికంగా వసతులు లేకపోవడంతో... ఇళ్లు ఏర్పాటుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. కాలనీలో రహదారులు, వీధి దీపాలు, వర్షం కాలువలు లేకపోవడంతో... స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలెందుకు ఇళ్ల నిర్మాణం చేపట్టామా అని మదన పడుతున్నారు. కాలనీలో తాగునీటి కుళాయిలు లేకపోవడంతో బయట ప్రాంతాల్లో కొనుగోలు చేసి తీసుకురావాల్సిన దుస్థితి. సమస్య పరిష్కారానికి రూ. 70 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేస్తామని గత పాలకులు ప్రకటించినా, ఆ దిశగా చొరవ చూపలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీ ముంపునకు గురైంది. పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో రహదారులు, తాగునీటి వసతి కల్పనకు ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభలో తీర్మానం చేశాం. నిధులు మంజూరు కాగానే అయా పనులు చేపడతాం' అని గ్రామ కార్యదర్శి సునంద తెలిపారు.



పెదనిండ్రకొలనులో దారి సౌకర్యం లేక ఇలా...



మాట్లాడుతున్న శ్రీనివాస్

రాయితీపై టార్పాలిన్లు అందించాలి

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో 50 శాతం రాయితీపై టార్పాలిన్లు అందించి అన్నదాతలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఆయన నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని పలుచోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. భారీ వర్షాల నుంచి పంట కాపాడుకోవడానికి టార్పాలిన్లు కీలకమన్నారు. నాణ్యమైన గోనె సంచులు సిద్ధం చేయాలని అధికారులు చెబుతున్నా, రైతు సేవా కేంద్రాల్లో మాత్రం చిరిగిన సంచులు దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. నాయకులు భాస్కరరావు, వెంకట కృష్ణారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పశువులను వీధుల్లో వదిలితే చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పశువులను వీధుల్లో వదిలితే యజమానులపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ హెచ్చరించారు. నగర వీధుల్లో పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతూ ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. దీనికితోడు వాహన రాకపోకలకూ అంతరాయం ఏర్పడుతోందన్నారు. గతంలో పలుమార్లు పశువుల యజమానులకు సూచనలిచ్చినా, ఫలితం లేకుండా పోయిందన్నారు. నగర వీధుల్లో పశువులు కనిపిస్తే గో సంరక్షణ శాలకు తరలిస్తామని, వాటినయ్యే పోషణ ఖర్చును యజమానుల నుంచే వసూలు చేస్తామని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మూడ్రోజుల్లోపు పందులు తరలింపు.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నగరంలో తిరుగుతున్న పందులను మూడ్రోజుల్లోపు నగర శివారులోని చెత్త నిల్వ కేంద్రం సమీప స్థలంలోకి తరలించాలని కమిషనర్ భానుప్రతాప్ ఆదేశించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పందుల కోసం స్థలాన్ని కేటాయిస్తూ నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంతెన.. ప్రమాదపుటంచున!



కోతకు గురై..

దెందులూరు మండలం పోతునూరు నుంచి భీమడోలు మండలం గుండుగొలను వెళ్లే మార్గంలోని పంట కాలువ పైనున్న కల్వర్టు రక్షణ గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ వంతెన మలుపు నుంచి కిందిపల్లి వెళ్లే దారిలో ఉంది. పైడిచింతపాడు తదితర గ్రామాల వస్తాయి. కల్వర్టు ప్రాంతం కావడంతో నిత్యం ఆక్వా ఉత్పత్తులతో వంతెన మీదుగా పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మలుపులో వాహనాలు తిరుగుతున్నప్పుడు ఇరుకుగా ఉన్న వంతెన సరిగా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - ఈనాడు, దెందులూరు



రక్షణ గోడల్లేక ఇలా..

చికిత్స పొందుతూ చోదకుడి మృతి

దెందులూరు, న్యూస్‌టుడే: సత్యనారాయణపురం వద్ద జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ చోదకుడు పెదమళ్ల వీరవెంకట సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవుల అక్రమ రవాణా.. ఇద్దరిపై కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆవులు, లేగదూడలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఓ వ్యానులో 3 ఆవులు, 3 దూడలను ఆదివారం రాత్రి తరలిస్తున్నారు. మార్గం మధ్యలోని ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో గో సంరక్షణ సమితి సభ్యులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోవులను రావులపాలెం నుంచి ఏలూరు కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన చోదకుడు తిరుమల అశోక్, రావులపాలెనికి చెందిన తిరుమల బ్రహ్మయ్యపై సోమవారం రాత్రి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేర వార్తలు

బంగారు గొలుసు చోరీ..

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కారు వెనుక సీటులో కూర్చొని నిద్రిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దొంగలు లాక్కెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా పురుషోత్తపురానికి చెందిన తవిటి నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో కనకదుర్గమ్మ దర్శనార్థం విజయవాడ వెళ్లారు. అమ్మవారి దర్శనానంతరం ఆదివారం రాత్రి తిరుగు పయనమయ్యారు. మార్గం మధ్యలోని ఏలూరు నగర శివారు సర్వీసు రోడ్డులో డ్రైవర్ కారు ఆపి నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో వెనుక సీటులో నిద్రిస్తున్న మహిళ మెడలోని 2 కాసుల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లిపోయారు. దాంతో బాధితులు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా- వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శాంతినగర్ 2వ రోడ్డులో..

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతినగర్ 2వ రోడ్డులో ఉపాధ్యాయిని జలసారి రమాదేవి నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపు తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 7 తులాల బంగారం నగలు, 100 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No: 23/2024

1. రెడ్డి సూర్యనారాయణ ...పిటిషనరు

వర్సెస్

1. కలిదిండి శ్రీనివాసు, 2. కలిదిండి రమణ, 3. షేక్ శ్రీనివాస్, 4. షేక్ నాగూర్, 5. అధికారిక రిసీవర్, ఏలూరు జిల్లా, ఏలూరు ...ప్రతివాదులు

ప్రకటన

1. కలిదిండి శ్రీనివాసు, S/o వీరన్న, వయస్సు 53, వృత్తిపనులు, వ్యాపారం, D.No:9-91 తాడి వారి వీధి, వెంకటాపురం, గణపవరం గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా - 534198

2. కలిదిండి రమణ, W/o శ్రీనివాసు, వయస్సు 48, వృత్తిపనులు, వ్యాపారం, D.No:9-91, తాడి వారి వీధి, వెంకటాపురం, గణపవరం గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా - 534198

3. షేక్ శ్రీనివాస్, S/o షేక్ బాజాన్ సాహెబ్, వయస్సు 48 సంవత్సరాలు, వ్యాపారం, మోటారు మైకిల్ మెకానిక్, నేతుల వారి వీధి, గణపవరం గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా - 534198

4. షేక్ నాగూర్, S/o షేక్ బాజాన్ సాహెబ్, వయస్సు 45 సంవత్సరాలు, వ్యాపారం, మోటారు మైకిల్ మెకానిక్, నేతుల వారి వీధి, గణపవరం గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా - 534198

5. అధికారిక రిసీవర్, ఏలూరు జిల్లా, ఏలూరు SJC (JD).

పై ఒకటి, రెండు వారందరు Insolvents గా declare చేయుటకును, పై యందున్న, పై మూడు, నాలుగు వారలకు వారి ఆస్తిని ఇన్సాల్వెన్సీ కింద ఎటాచ్ చేయుటకు, పై కోర్టు వారు పై కోర్టు వారి యందు దాఖలు చేయబడిన I.P. 23/2024 వ్యాజ్యము దాఖలు చేయబడినది. ఇందుపై మీ అభ్యంతరములు ఉన్నచో పై కోర్టు వారి యందు 21-10-2024 తేదీన ఉదయం 10.30 గంటల సమయమునకు హాజరై మీ అభ్యంతరములను తెలియజేయవలెను.

సం/- గొల్లపూడి శ్యామ ప్రసాద్ ముఖర్జీ, న్యాయవాది, తాడేపల్లిగూడెం

తేది. 30-9-2024

రిక్షా లిలా... స్వచ్ఛతెలా!

స్వచ్ఛ సంకల్పంలో భాగంగా దెందులూరు మండలం పోతునూరు పంచాయతీకి కేటాయించిన రిక్షాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వైకాపా జమానాలో అందజేసిన చెత్త సేకరణ రిక్షాలు మూలకు చేరి.. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టాయి. అధికారులు స్పందించి రిక్షాలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, దెందులూరు



పల్లె దారి.. ఛిద్రంగా మారి!

ఉంగుటూరు మండలం దొంతవరం- కాగుపాడు రహదారి చిన్నపాటి వర్షానికే ఛిద్రంగా మారుతోంది. అడుగడుగునా గోతులుండటంతో.. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఒళ్లు హూనమవుతోంది. అయిదేళ్ల వైకాపా పాలనలో రహదారుల నిర్వహణను గాలికి వదిలేశారని, ఎన్డీయే ప్రభుత్వమైనా బాగు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఉంగుటూరు



గేటు.. బండి కదిలితే ఒట్టు

పెదపాడు మండలం కొక్కిరపాడు వద్ద రైల్వే గేటు పడితే చాలు.. గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారిపై నుంచి కొక్కిరపాడు మీదుగా నూజివీడు మండలంలోని పలు గ్రామాలకు ప్రధాన మార్గమిదే. ఈ రోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే గేటు పడిన ప్రతిసారీ వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతున్నాయి. - న్యూస్‌టుడే, పెదపాడు



(c) eenadu

పోలవరం

•పోలవరం • చింతలపూడి

పట్టభద్రుల ఓట్ల నమోదుపై అవగాహన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో సోమవారం సాయంత్రం కూటమి పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులకు పట్టభద్రుల ఓట్ల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, దాసరి శేషు, ఘంటా మురళి, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామ్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. **పోలవరం, న్యూస్‌టుడే:** స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓటు హక్కు నమోదుపై పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు తహసీల్దార్ సాయిరాజు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలన్నారు.

ఏపీడీగా బాధ్యతల స్వీకరణ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏలో వెలుగు ఏపీడీగా ఇ.రాజబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో డీపీఎంగా చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీడీ మడి నాగేశ్వరరావు కాకినాడకు బదిలీపై వెళ్లారు.

యర్రంపల్లిలో 'పొలం పిలుస్తోంది'

చింతలపూడి, న్యూస్‌టుడే: రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి షాఫియా అన్నారు. యర్రంపల్లి రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో ఏవో మీనాకుమారి పాల్గొన్నారు.

'పాలనాధికారులుగా హిందువులే ఉండాలి'

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దేవాలయాల్లో పాలనాధికారులుగా హిందువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దేవాలయాలు హిందూ ధార్మిక కేంద్రాలైనందున కమిటీల్లో హిందువులను మాత్రమే నియమించాలని విజ్ఞప్తి చేశారు.

జూద స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారు మార్కండేయపురం వద్ద నిర్వహిస్తున్న జూద స్థావరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

'ప్రొఫెసర్ సాయిబాబా కృషి మరువలేనిది'

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబా చేసిన కృషి మరువలేనిదని ప్రజానాట్య మండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీయస్ రాజు అన్నారు. బొర్రంపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన సాయిబాబా సంతాప సభలో జానపద కళాకారుల సంఘం సభ్యులు కనకారావు, సత్యనారాయణ, కృష్ణబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

బాల బడుల్లో వసతులు!

తాగునీరు, మరుగుదొడ్లకు నిధులు

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. సొంత భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. కూటమి సర్కారు 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మంజూరైన ఈ నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలన్న నిశ్చయంతో యంత్రాంగం ఉంది. నియోజకవర్గంలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని ఆరు మండలాలతో పాటు చింతలపూడి ప్రాజెక్టు పరిధిలోని టి.నరసాపురం మండలంలోని కేంద్రాలతో కలిపి 104 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 79 చోట్ల మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు.


చొప్పరామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రం

వివరాలు ఇలా

ప్రాజెక్టు	మండలాలు	తాగునీటి సౌకర్యం	నిధులు (రూ.లక్షల్లో)	మరుగుదొడ్లు	నిధులు (రూ.లక్షల్లో)
కొయ్యలగూడెం	కొయ్యలగూడెం పోలవరం	52	8.84	23	8.28
బుట్టాయగూడెం	బుట్టాయగూడెం జీలుగుమిల్లి	18	3.06	14	5.04
కుక్కునూరు	కుక్కునూరు వేలేరుపాడు	31	5.27	38	13.68
చింతలపూడి	టి.నరసాపురం	03	0.51	04	1.44

త్వరలో పనులు ప్రారంభం

తాగునీటి సదుపాయం కల్పనకు ఒక్కో యూనిట్‌కు రూ.17వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.37వేలు చొప్పున నిధులు మంజూరయ్యాయని ఐసీడీఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు సీడీపీవో తులసి పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ కొయ్యలగూడెం ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం-కన్నాపురం గ్రామాల మధ్య తూర్పు కాలువ ప్రధాన రహదారిపై మలుపులో చప్టా వద్ద సోమవారం జంగారెడ్డిగూడెం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం వెళుతూ మరమ్మతులకు గురికావడంతో దాదాపు గంట సేపు ఆగిపోయింది. ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని కేఆర్‌పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం నాలుగు బృందాలకు మూడు రోజుల చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వైద్యులు ఆంజనేయులు, ఉదయ్‌కిరణ్, పున్నారి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.


మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

'ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యం'

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా, జనసేన, భాజపా ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వెంపాడ చిరంజీవిరావు అన్నారు. ఈ మేరకు కొయ్యలగూడెం సమీపంలోని రేపల్లెవాడలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఓటరును గుర్తించి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలన్నారు. రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, నాయకులు పారేపల్లి రామారావు, బొల్లిన నిర్మలకిశోర్, మాదేపల్లి శ్రీను, చింతల వెంకటరమణ, చోడిపిండి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పక్కన ఎమ్మెల్యే బాలరాజు

న్యాయం చేయాలంటూ గిరిజనుల ధర్నా

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: భూ వివాదంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ బుట్టాయగూడెం మండలం మర్రిగూడెనికి చెందిన గిరిజనులు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సోమవారం ధర్నా చేశారు. ప్రదర్శనగా కార్యాలయానికి చేరుకుని పలు నినాదాలతో ఆందోళన కొనసాగించారు. 1/70 చట్టం పరిధిలోని 23.36 ఎకరాల ఎల్టీఆర్ భూమిలో ఇరవై ఏళ్లుగా జీడిమామిడి తోట సాగుచేస్తూ జీవిస్తున్నామని, ఇద్దరు గిరిజనేతరులు సాగును అడ్డుకుంటూ తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఏపీవో పీవీఎస్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాశ్, నాయకులు సముద్రాల సుందర్రావు, సాలి రాజశేఖర్, పూనెం పార్వతి, సున్నం సోమరాజు, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద..

వరద నష్టంపై రీసర్వే కోరుతూ.. **జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** విజయవాడ వరద నష్టానికి సంబంధించి రీసర్వే చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ మాట్లాడుతూ వరద బాధితులు 2.50 లక్షల మంది అని ప్రకటించిన ప్రభుత్వం.. సమగ్ర సర్వే చేయకుండా 40 శాతం కుటుంబాలకే నష్ట పరిహారం అందించిందని ఆరోపించారు. రీసర్వే చేసి ప్రతి బాధితుడికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. నాయకులు ఇ.భూషణం, బన్నే వినోద్, తగరం బాబూరావు, యు.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామీణ రహదారులకు మహర్దశ

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: ఉపాధి నిధులతో గ్రామీణ రహదారులకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. కామవరపుకోట మండలం తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, తాడిచెర్ల, గుంటుపల్లి, ఉప్పలపాడు, రావికంపాడు తదితర పంచాయతీల్లో సోమవారం నిర్వహించిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.6 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, నాయకులు కిలారు సత్యనారాయణ, కొనేరు వెంకటసుబ్బారావు, తూతా లక్ష్మణరావు, జుజ్జూరి బాబ్జీ, ఘంటా సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన పూజ చేస్తున్న రోషన్‌కుమార్

డిసెంబరు 13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా 26వ మహా సభలు బుట్టాయగూడెంలో డిసెంబరు 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం తెలిపారు. మహా సభల సన్నాహక సమావేశం బుట్టాయగూడెంలో పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మన్యంలో 35 ఏళ్ల భూ పోరాటాల నేపథ్యంలో తొలిసారిగా మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు, ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడిగా పోలోజు నాగేశ్వరరావు, కార్యదర్శిగా తెల్లం రామకృష్ణ, మరికొంతమంది ప్రతినిధులను నియమించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఆర్.లింగరాజు, నాగమణి, తెల్లం దుర్గారావు, నాగేంద్రరావు, ముత్యాలమ్మ, ఫ్రాన్సిస్, కారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా కన్నాపురం, తంగెళ్లగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులను రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి సోమవారం ప్రారంభించారు. కన్నాపురంలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. డీఎల్‌డీవో రాజు, సర్పంచి ఉప్పల పద్మావతి, గొడవర్తి విద్యాసాగర్, షేక్ బాజీ, కాగితాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. పూడిక తొలగదు!


వీరభద్రస్వామి ఆలయం రోడ్డులో పూడిపోయిన మురుగు కాలువ

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: మండల కేంద్రం కామవరపుకోటలో మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయి మురుగు పారే దారి మూసుకుపోయింది. కామవరపుకోట-చింతలపూడి ప్రధాన రహదారి నుంచి వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లే వీధిలో భారీ డ్రెయిన్ పూడికతో నిండిపోయింది. గడ్డి మొలిచింది. దీని అనుసంధాన కాలువలు సైతం మురుగుతో నిండిపోయాయి. తూటికాడ పెరిగి నీరు ముందుకు కదలడం లేదు. దీంతో పరిసరాలు అపారిశుద్ధ్యంగా మారాయి. దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు శుభ్రం చేసి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని గ్రామ కార్యదర్శి రవి నాయక్ తెలిపారు.

వేలేరుపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రం వేలేరుపాడులోని జగన్నాథపురంలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దారికి ఆనుకుని ఉన్న కాలువలో గడ్డి, చెత్తాచెదారం పెరగడంతో మురుగు ముందుకు పారడం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలో మురుగు తొలగించాలని కోరుతున్నారు.



భవనాలు పూర్తికాక.. అవస్థలు తీరక!

ధర్మాజీగూడెం (లింగపాలెం), న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రజల వద్దకే సేవలంటూ ఊదరగొట్టిన గత వైకాపా ప్రభుత్వం.. ఆచరణలో ఆశించిన ఫలితం చూపలేకపోయింది. మండలంలోని 22 పంచాయతీలకు గాను 19 సచివాలయాల భవనాల నిర్మాణానికి రూ.25 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వీటిలో 14 పూర్తయ్యాయి. ధర్మాజీగూడెంలో చిన్నచిన్న పనులు మిగిలిపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సిబ్బంది శిథిలావస్థకు చేరి, అరకొర వసతులతో కూడిన అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముఖ్యమైన దస్త్రాలు, కంప్యూటర్లు తడిచిపోయాయని సిబ్బంది చెబుతున్నారు. కొత్తపల్లి, రంగాపురం గ్రామాల్లోని భవనాలు పునాది స్థాయికే పరిమితమయ్యాయి. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ జగన్నాథరావు మాట్లాడుతూ గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. త్వరలోనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


కొత్తపల్లిలో పునాది స్థాయిలో..


ధర్మాజీగూడెం సచివాలయం

హరినామ సంకీర్తనలు ఆలపించే అవకాశం కల్పించాలి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిరుమల కొండపై భజన బృందాలకు హరినామ సంకీర్తనలు ఆలపించేందుకు అవకాశాలు కల్పించాలని పెద్ద తిరుపతి అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి అన్నారు. ద్వారకాతిరుమల దేవస్థానంలో హైందవ భక్త భజన బృందాల సమ్మేళనం సకల కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయశంకర స్వామి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్న భజన కళాకారులకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాయన సహదేవరాజు తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న విజయశంకర స్వామి తదితరులు

సందడిగా అమ్మవారి నిమజ్జనాలు

ముగిసిన దసరా వేడుకలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ గ్రామోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆటోనగర్ నుంచి గంగానమ్మ ఆలయం వరకు మహిళలతో భారీ శోభా యాత్ర నిర్వహించారు. విజయదుర్గమ్మ ఆలయంలో భారీగా అన్నదానం చేశారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పంగిడిగూడెంలో శ్రీకృష్ణుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో దెందులూరు మండలం పెరుగుగూడేనికి చెందిన యలమర్తి బాలకృష్ణ రూ.6వేలకు దక్కించుకున్నారు.


కొత్తపట్టిసీమలో అమ్మవారి ఊరేగింపు

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపట్టిసీమ, కృష్ణారావుపేట, పట్టిసీమ గ్రామాల్లో అమ్మవారిని ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి శిర్డీసాయిబాబా ఆలయంలో భారీ అన్నసమారాధన, లడ్డూ వేలం కార్యక్రమాలు నిర్వహించారు.


వెలగపాడులో..


పంగిడిగూడెంలో కనకదుర్గమ్మ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బండివారిగూడెం, బొర్రంపాలెం, వెలగపాడు, తిరుమలదేవిపేట, తెడ్లం గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగించిన అనంతరం స్థానిక చెరువులు, కాల్వలో నిమజ్జనం చేశారు. తిరుమలదేవిపేటలో అన్న సమారాధన నిర్వహించారు.

ఎడమ కాలువ గండి పూడ్చివేత

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎర్రకాలువ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువకు పడిన గండిని జలవనరుల శాఖ అధికారులు సోమవారం పూడ్చారు. ఎడమ ప్రధాన కాలువకు ఈ నెల 5న 4.5 కిలోమీటరు వద్ద భారీ గండి పడింది. దీంతో పంట చేలు మునిగిపోతుండటంతో కాలువ కట్టేశారు. ఈ సమస్యను 'నీటి ఎద్దడితో రైతుల గగ్గోలు' శీర్షికన ఈ నెల 10న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జలవనరుల శాఖ డీఈ రాంబాబు స్పందించారు. గండి పూడ్చడంతో పాటు కాలువ ద్వారా నీటి విడుదలను పునరుద్ధరించినట్లు ఆయన చెప్పారు.



ఈనాడు కథనాలకు స్పందన

శుభ్రపడిన పాలశీతలీకరణ కేంద్రం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: 'మిద్దె తోట కాదు.. నిర్లక్ష్యానికి పరాకాష్ఠ' శీర్షికన ఈ నెల 10న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మండల సమాఖ్య ఏపీఎం శ్రీనివాస్ స్పందించారు. ఎంపీడీవో కార్యాలయం సమీపాన నిరుపయోగంగా ఉన్న పాలశీతలీకరణ కేంద్రం భవనంపై పెరిగిన గడ్డి, తుప్పలను కూలీల సాయంతో సోమవారం తొలగించడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం ప్రగడపల్లిలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ పెరిగిన తుప్పలను సోమవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై ఈ నెల 12న 'ఈనాడు'లో 'పొదల మధ్య పరివర్తకం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. సమస్య పరిష్కారం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



ఉర్దూ పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలోని ఉర్దూ పాఠశాలను తెలుగు ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. ఈ కారణంగా 39 మంది విద్యార్థులకు ఉర్దూలో పాఠ్యాంశాల బోధన జరగడం లేదు. మండలంలో ఆయా ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సమీపంలోని పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై ఒకరిని, పని సర్దుబాటులో మరో ఉపాధ్యాయుడిని ఇటీవల నియమించారు. వారు ఉర్దూలో శిక్షణ పొందిన వారు కాదు. దీని వల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని ఎంఈవో-2 రాములు తెలిపారు.



ఎర్రటి వస్త్రమే ప్రమాద సూచిక!

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: కామవరపుకోట మండలం ఉప్పలపాడు వద్ద ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిపై పడిన భారీ గుంత ప్రమాదకరంగా మారింది. సుమారు రెండు అడుగుల లోతున, 5 అడుగుల వెడల్పున ఉంది. ఈ కారణంగా ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు చక్రాల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుంతను గుర్తించేందుకు స్థానికులు ఎర్రటి వస్త్రం కట్టిన కర్ర నిలబెట్టారు. ఆర్‌ అండ్‌ బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదివాసీలకే దుకాణాలు కేటాయించాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలో మద్యం దుకాణాలను స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు కోరారు. ఐకాస సమావేశం సోమవారం బుట్టాయగూడెంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య అధ్యక్షతన నిర్వహించారు. పెసా చట్టం కింద గ్రామసభలు నిర్వహించి, దుకాణాలు కేటాయించాలన్నారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

నవగ్రహ ఆలయం పరిశీలన

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని నవగ్రహ దేవాలయాన్ని కొవ్వూరు వేద పాఠశాల నిర్వాహకుడు డాక్టర్ దోర్బల ప్రభాకర శర్మ సోమవారం పరిశీలించారు. ఆలయ ఆవరణలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయం భవిష్యత్తులో గొప్ప పుణ్యక్షేత్రం అవుతుందన్నారు. ఆలయంలో జరిగే పూజ విధానం, హోమాల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జొరిగె సత్యనారాయణ, రామకృష్ణ, కుటుంబరావు, తల్లాప్రగడ కుమార్, సుధాకర్, ఆంజనేయులు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలోని శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారి శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు సాయి స్వరూప్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268	కలిదిండి: 90594 84862

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: రమణక్కపేట నుంచి నూజివీడు వైపు వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షపు నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. **- జి.అఖిల్, రమణక్కపేట**

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే గుంతలు పూడ్చిస్తాం. **- అశోక్, ఆర్‌అండ్‌బీ, ఏఈ**

చాట్రాయి, న్యూస్‌టుడే

సమస్య: బూరుగుగూడెంలో రహదారిపై మురుగు నీరు పారుతోంది. దీంతో దుర్వాసన వస్తోంది. **- వెంకటేశ్వరరావు, బూరుగుగూడెం**

సమాధానం: కార్యదర్శితో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. **- వి.విజయలక్ష్మి, ఎంపీడీవో, చాట్రాయి**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని భుజబలపట్నంలో ప్రధాన రహదారి వెంబడి పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. రోజుల తరబడి ఆ చెత్తను సేకరించకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- శ్యామలరావు, భుజబలపట్నం**

సమాధానం: వెంటనే చెత్త తొలగించి పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా చర్యలు చేపడతాం. **- వి.కొండలరావు, ఈవోపీఆర్డీ, కైకలూరు**

స్పందనకు వందనం

పొదల తొలగింపు.. **ముసునూరు, న్యూస్‌టుడే:** సింహాద్రిపురం సెంటర్ సమీపంలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ తీగజాతి పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. సోమవారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సమస్య ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు అధికారులు స్పందించి పొదలను తొలగించారు.

- మండవల్లి మండలం లోకుమూడి పెట్రోల్ బంక్ సమీపంలో ఈనెల 10న ద్విచక్రవాహనం ఆవును ఢీకొనడంతో గుడివాడకు చెందిన ఓ మహిళా మృతి చెందగా ఓ యువకుడు కోమాలోకి వెళ్లాడు.
- చావలిపాడు రైస్ మిల్ సమీపంలో ఈనెల 4న ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆవును ఢీకొనడంతో కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంకా కోలుకోలేదు.
- ఆరు నెలల క్రితం కైకలూరు మండలం ఆటపాక వద్ద ఓ యువకుడు ఆవును ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయాడు.
- ఆగస్టు నెలలో చింతపాడు వద్ద గేదెను ఢీకొట్టడంతో వ్యాను బోల్తా పడింది.
- గతేడాది దెయ్యంపాడు సెంటర్లో ఓ యువకుడు ఆవును ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయాడు. అంతకు ముందు కైకలూరుకు చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు మణుగునూరు వద్ద రాత్రి వేళలో గేదెను ఢీకొని మృత్యువాత పడ్డాడు.

రోడ్లపై సంచరిస్తూ.. ప్రమాదాలకు కారణమవుతూ..

• ఆసుపత్రుల పాలవుతున్న చోదకులు
• కట్టడికి చర్యలు శూన్యం



మండవల్లి: ఇష్టారాజ్యంగా పరుగులు పెడుతూ.. (పాత చిత్రం)

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే

కైకలూరు నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువులతో వాహనచోదకులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పశువులను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అయినా వాటి నివారణకు అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. కైకలూరు- మండవల్లి మార్గంలో ఆవులు, కైకలూరు-ఏలూరు రహదారిలో గేదెలతో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఒకదానికొకటి ఘర్షణ పడుతూ..

ఇటీవల కురిసిన వర్షాలకు పశువులు ఎక్కువగా రోడ్ల మీదే ఉంటున్నాయి. ఒకదానికొకటి ఘర్షణ పడుతూ.. రోడ్లపై అడ్డదిడ్డంగా పరుగులు పెడుతున్నాయి. రాత్రి వేళ్లలో ఇవి కనిపించకపోవడంతో ఢీకొని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ట్రాఫిక్ అంతరాయం

కైకలూరు మార్కెట్ సెంటర్, ఏలూరు రోడ్డు, బస్టాండ్ సెంటర్లలో పెద్దఎత్తున ఆవులు రోడ్డు మీదే పడుకుంటున్నాయి. దీంతో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాటిని పక్కకు తొలేందుకు ఎంత ప్రయత్నించినా.. ఫలితం ఉండటంలేదు.

చర్యలు తీసుకుంటాం..

రోడ్లపై నిర్లక్ష్యంగా పశువులను వదిలేస్తున్న యజమానులకు నోటీసులు ఇస్తాం. అయినా పశువులను అదుపు చేయకపోతే గోశాలలకు తరలిస్తాం. కొల్లేరు ప్రాంతంలో రైతులకు చెందిన గేదెలకు రేడియం పెయింట్, బెల్టులు వేసేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. **- రవికుమార్, గ్రామీణ సీఐ, కైకలూరు**



వేల్పుచర్లలో ఊరేగింపు

ఘనంగా గొంతెనమ్మ ఉత్సవాలు

ముసునూరు, న్యూస్‌టుడే: వేల్పుచర్ల పడమర ఎస్సీ కాలనీలో సోమవారం గొంతెనమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కోలాటం, జానపద గేయలతో మహిళలు, గ్రామస్థులు గొంతెనమ్మను పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ముసునూరు న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఐసీ కార్యాలయాలలో అగ్నిమాపక పరికరాల పరిశీలన కొనసాగుతుందని, ఇందులో భాగంగా స్థానిక కార్యాలయ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాము

మండవల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయన్నారు. గ్రామాల పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని, మురుగు పారుదలకు పూడికతీత పనులు వెంటనే చేయాలన్నారు. అనంతరం మూడు నెలల అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావు, ఈవోపీఆర్డీ శేఖర్, వైస్ ఎంపీపీ ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తరహా సౌకర్యాలు కల్పించాలి



దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థినిని సొంతవారిలా చూసుకుంటూ.. ఇంటి తరహా మౌలిక వసతులు కల్పించాలని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ.లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వంటశాల, పడక గదుల నిర్వహణ తీరు, హాజరు పట్టిక, భోజనం మెనూ, పలు దస్త్రాలు పరిశీలించి వసతి గృహ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. మెనూ ప్రకారం బాలికలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులతో మాత్రమే విద్యార్థులను బయటకు పంపించాలన్నారు. వసతి గృహంలో ఎటువంటి ఇబ్బందులు కలిగిన మండల న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు పిచ్చుకల పవన్‌కాంత్, ప్రసన్నకుమార్, వార్డెన్ ఎం.రాధా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యం సామాజిక నేరం



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని, అలా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో విద్యుత్తు వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్తు విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 40 బృందాలు 2,842 గృహ సర్వీసులు, 171 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశాయి. వాటిలో 184 సర్వీసులకు అదనపు లోడ్ వాడుతున్నందుకు గాను రూ.5,30,000 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఈఈ ఎ.సత్యనారాయణ, డీఈ ఎం.పోతురాజు, ఏఈ ఎం.రామారావు, డివిజన్ పరిధిలో సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై టార్పాలిన్లు అందించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో 50 శాతం రాయితీపై టార్పాలిన్లు అందించి అన్నదాతలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని పలుచోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. భారీ వర్షాల నుంచి పంట కాపాడుకోవడానికి టార్పాలిన్లు కీలకమన్నారు. నాణ్యమైన గోనె సంచులు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నా, రైతు సేవా కేంద్రాల్లో మాత్రం చిరిగిన సంచులు దర్శనమిస్తున్నాయని ఆయన ఆరోపించారు. నాయకులు భాస్కరరావు, వెంకట కృష్ణారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలంలోని అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, లోపూడి, చెక్కపల్లి గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ- శంకుస్థాపన వారోత్సవాల్లో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారని ఎంపీడీవో జి.రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యం'

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా, జనసేన, భాజపా ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వెంపాడ చిరంజీవిరావు అన్నారు. ఈ మేరకు కొయ్యలగూడెం సమీపంలోని రేపల్లెవాడలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఓటరును గుర్తించి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలన్నారు. రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, నాయకులు పారేపల్లి రామారావు, బొల్లిన నిర్మలాకిశోర్, మాదేపల్లి శ్రీను, చింతల వెంకటరమణ, చోడిపిండి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా.. 'పల్లె పండగ'

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు గ్రామాల్లో చేస్తున్నట్లు మంత్రి పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు వంటి మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. గ్రామ సభలు నిర్వహించి, గ్రామస్థులకు అవసరమైన సదుపాయాలను వారి ద్వారానే తెలుసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అంతకు ముందు నూజివీడు మండలం ఓగిరాల తండా, వెంకటాయపాలెం, మిట్టగూడెం, పడమర దిగవల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, వెంకటరెడ్డి, బర్మా ఫణిబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం సిమెంటు రోడ్లు వేస్తాం: కామినేని.. కైకలూరు, న్యూస్‌టుడే: అయిదేళ్ల పాలన పూర్తయ్యే నాటికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నూరుశాతం సిమెంటు రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కైకలూరు ఎన్జీవోస్ కాలనీ, మండలంలోని తామరకొల్లులో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, కూటమి నాయకులు పి.త్రినాథరాజు, లక్ష్మీరాణి, వాసురాజు, పూల రామచంద్రరావు, నర్సిపల్లి అప్పారావు, కొల్లి వరప్రసాద్, వాసురాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు.



కాళ్లపాలెంలో భూమి పూజ చేసిన నాయకులు



నూజివీడు: శిలా ఫలకం వద్ద మంత్రి పార్థసారథి



భైరవపట్నం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

మండవల్లి: వైకాపా అయిదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండవల్లి మండలం భైరవపట్నం, లింగాల, కానుకొల్లు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కానుకొల్లులో రాయగిరి ఆంజనేయులు, సావిత్రి జ్ఞాపకార్థం వారి కుమారుడు రాము నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించారు. నాయకులు వీరమల్లు నరసింహారావు, నారగాని నాగేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేశ్‌బాబు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఈ కమల్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పల్లెలోని రహదారులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు పోకల జోగిరాజు అన్నారు. గోపాలపురంలో రూ.7.20 లక్షలు, కాళ్లపాలెంలో రూ.20.24 లక్షలతో నిర్మించనున్న రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పేటేటి స్వర్ణకుమారి, అనపర్తి వడ్డి కాసులు, మేడిశెట్టి సీతా రామాంజనేయులు, నల్లజర్ల సత్యనారాయణ, వాకాని కోటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: దాకరంలో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి సర్పంచి జాస్తి రాజా భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యదర్శి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాయుగుండం.. రైతన్నకు గండం!

వాతావరణ మార్పులతో ఆందోళన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే అధిక వర్షాలు కురిశాయి. దీనివల్ల భారీగా పంట నీట మునిగి రైతులు నష్టపోయారు. ఎట్టకేలకు ఆ దెబ్బ నుంచి కోలుకుని పంటను కాపాడుకుంటున్నారు. మళ్లీ వాతావరణ శాఖ హెచ్చరికలతో పంట ఏమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట నష్టపోయే ప్రమాదం

కైకలూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. ఎంటీయూ 1318, 1061, స్వర్ణ రకాలు అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఎక్కువగా అంకురం నుంచి పొట్ట దశలో ఉన్నాయి. వీటితో పూత దశలో, పిలక దశలో మరికొన్ని పొలాలు ఉన్నాయి. పూత దశలో ఉన్న వాటికే అధికంగా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల పాలు పోసుకోకపోవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పు రావడంతో పాటు పలుసార్లు మోస్తరు జల్లులు కురిశాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం ఏకధాటిగా కురుస్తుండటంతో ఇంతకాలం అష్టకష్టాలు పడి కాపాడుకున్న పంటను నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

'వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు పొలాల్లో నీరు నిలవకుండా మురుగు పోయేలా కాలువలు శుభ్రం చేసుకోవాలి. ఆఖరి విడత ఎరువులు వేసుకుంటున్న రైతులు వర్షాలు తగ్గే వరకు వేయొద్దు.' **- జి.వెంకటమణి, ఏడీఏ, మండవల్లి**

ఊరేగింపులు.. అన్నసమారాధనలు

కలిదిండి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని కోరుకొల్లు, సానారుద్రవరం, కలిదిండి, సున్నంపూడి తదితర గ్రామాల్లో సోమవారం కనకదుర్గమ్మ ప్రతిమలను ఊరేగించారు. కోరుకొల్లు శివారు బొబ్బిలిగూడెంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

చాట్రాయి: కోటపాడు పాత రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ ప్రతిమను ప్రత్యేక వాహనంపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

ముదినేపల్లి: దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగింపు సందర్భంగా ఆలయాల్లో అన్నసమారాధన, ఊరేగింపులు నిర్వహించారు. దేవపూడిలోని విజయదుర్గ ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. వాడవల్లిలో అమ్మవారి ఊరేగింపు, తెప్పోత్సవం నిర్వహించారు.



వాడవల్లిలో తెప్పోత్సవం



కోటపాడులో..



సున్నంపూడిలో..

బాలిక అదృశ్యం: ఇద్దరిపై కేసు

ముసునూరు న్యూస్‌టుడే: బాలిక అదృశ్యమైన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ముసునూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక నూజివీడులోని గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన బాలికను శనివారం రమణక్కపేట గ్రామానికి చెందిన ఆముదాల బుచ్చిబాబు, తాతయ్య బలవంతంగా ఇంటి నుంచి తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక తల్లిదండ్రులు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయిని పి.పుష్పలత తెలిపారు. హేమ నాగ త్రివేణి, ఎల్.మున్నీ జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని అభినందించారు. టి.నవ ప్రశాంతి, సీహెచ్ ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకొస్తాం'



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహనరావు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకొస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. స్థానిక అగ్రహారంలోని పార్టీ కార్యాలయంలో ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైకాపా నాయకుడు మల్లెల వెంకటేశ్వరరావుతో పాటు పది మంది కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి రామ్మోహనరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దండుబోయిన చంద్రశేఖర్, ఏలూరు నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సేవాదళ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	మార్టిన్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వెట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వెట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

దారి.. ప్రమాదకరంగా మారి!



జనార్దనవరం- చాట్రాయి మార్గం ఇలా..



గొల్లగూడెంలో..

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి మండల కేంద్రం నుంచి జనార్దనవరం వెళ్లే ప్రధాన రహదారి గోతులతో దారుణంగా ఉంది. ఈ మార్గంలో నూజివీడు వరకు చిత్తపూరు మీదుగా రోజూ పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చిన్నపాటి వర్షం పడినా గొల్లగూడెం వద్ద ద్విచక్ర వాహనాలు కూడా నడిచే పరిస్థితి ఉండటంలేదు. గోతుల్లో నీరు చేరి వారం పది రోజులు నిల్వ ఉంటున్నాయి. తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రహదారికి అవసరమైన పనులను పరిశీలించామని, అంచనాలు రూపొందిస్తున్నట్లు ర.భ.శాఖ డీఈ బాబూరావు తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆవులు, లేగ దూడలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ వ్యానులో 3 ఆవులు, 3 దూడలను ఆదివారం రాత్రి తరలిస్తున్నారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో గో సంరక్షణ సమితి సభ్యులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. గోవులను రావులపాలెం నుంచి ఏలూరు సత్రంపాడుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వాహన చోదకుడు తిరుమల అశోక్, రావులపాలేనికి చెందిన తిరుమల బ్రహ్మయ్యపై సోమవారం రాత్రి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నగల చోరీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతినగర్ 2వ రోడ్డులో ఉపాధ్యాయిని జాలపర్తి రమాదేవి నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపు తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 7 తులాల బంగారు నగలు, 100 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu